కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.11, వంకాయ 18, బెండ 45, పచ్చి మిర్చి 23, కాకర 32, బీర 35, క్యాబేజి 8, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 15, దొండ 25–28, చిక్కుడు 28, గోకర 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 35, ఆలుగడ్డ 21, దోస 23, సొర కాయ 9, పొట్లకాయ 15, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 43. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



చైతన్యపురి: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. పలు కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. సాయినగర్, సత్యనారాయణపురం కాలనీలలో సీసీ రోడ్డు టెండర్ పూర్తయి ఏడాదైనా ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికీ పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరగా పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు.

ప్రత్యేక పూజలు



మలక్‌పేట: బోర్డు ఆఫ్ గవర్నర్ నేషనల్ బెట్టీ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ జయస్వామి శనివారం ఓల్డ్ మలక్‌పేట పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెంబర్‌గా నియమితులైన సందర్భంగా టెంపుల్‌కు వచ్చిన ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రవి కుమార్, బాబు శ్రీనివాస్, ఆకులరాజు, రాజరావుగౌడ్, రామకృష్ణ, మదన్ పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేత

చాదర్‌ఘాట్: మూసీ సుందరీకరణలో భాగంగా గతంలో ఓల్డ్‌మలక్‌పేట్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్, వాహెద్‌నగర్‌లో పాక్షికంగా కూల్చివేసిన ఇళ్లను శనివారం పూర్తిస్థాయిలో కూల్చివేశారు. గతంలోనే వీరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కత్తులతో సంచరిస్తున్న వ్యక్తి అరెస్టు



మొహమ్మద్ ఇమ్రాన్

చాదర్‌ఘాట్: కత్తులతో సంచరిస్తున్న ఓ వ్యక్తిని చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం పెట్రోలింగ్ చేస్తుండగా ఓల్డ్ మలక్‌పేట్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలో అనుమానాస్పద రీతిలో వెళ్తున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయతి్నంచగా వెంబడించి పట్టుకున్నారు. ఓల్డ్‌మలక్‌పేట్‌లో నివాసముంటున్న మొహమ్మద్ ఇమ్రాన్‌గా గుర్తించి అరెస్టు చేశారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



కృష్ణవేణి, ప్రణతి, గణేష్

మలక్‌పేట: ఇద్దరు పిల్లలతో ఓ తల్లి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, కోస్గి గ్రామానికి చెందిన గిరిమోని మల్లేష్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి భార్య కృష్ణవేణి(34), కుమారుడు గణేష్(13), కుమార్తె ప్రణతి(8)తో కలిసి మూసారంబాగ్ శ్రీపురం కాలనీలో ఉంటున్నారు. అతడు కూలి పనులు చేస్తుండగా కృష్ణవేణి ఇళ్లలో పని చేస్తోంది. ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. ఈ నెల 7న పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి భార్య పిల్లలు కన్పించలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. యాకుత్‌పురాలోని సయీద్ విల్లా ఫంక్షన్ హాల్ నిర్వహించిన కార్యక్రమంలో శనివారం ఆయన చార్మినార్ మండల పరిధిలో మంజూరైన 291 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గం పరిధిలోని చార్మినార్, బండ్లగూడ, సైదాబాద్ మండల పరిధిలోని లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకలను అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, పత్తార్‌గట్టి, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, అలందర్ వాలాజహి, చార్మినార్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



దంపింగ్‌యార్డ్ ప్రాంతంలో ఏర్పాటయ్యే ఫ్లవర్ పార్కు నమూనా

నాడు దుర్గంధం.. త్వరలో పచ్చదనం!

- ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో పార్కుకు శ్రీకారం
- ఎమ్మెల్యే చొరవతో పనుల్లో కదలికలు

మన్సూరాబాద్: గుట్టలు గుట్టలుగా పేరుకపోయిన చెత్త కుప్పలు, నగరంలో మృతి చెందిన జంతు కళేబరాల వ్యర్థాలతో తీవ్ర దుర్గంధంగా మారడంతో సమీప కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఆటోనగర్ చెత్తడంపింగ్ యార్డు ప్రాంతాన్ని దేశం గర్వించే విధంగా అత్యుత్తమైన సుందరమైన ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆ దిశగా తొలి ప్రయత్నంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఒకప్పుడు తీవ్ర దుర్వాసనతో ఉన్న కాలనీలు త్వరలోనే పచ్చదనంతో కళకళలాడే ఫ్లవర్ పార్కు ఏర్పాటుతో నూతన సొగసుతో అలరించనున్నాయి.

వైఎస్సార్ చొరవతోనే..

నాడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మన్సూరాబాద్ ప్రాంతవాసులు చేపడుతున్న పోరాటాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే డంపింగ్‌యార్డ్‌ను ఈ ప్రాంతం నుంచి తరలిస్తానని హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే డంపింగ్‌యార్డ్‌ను ఎత్తివేశారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతోనే ఇక్కడి డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి తరలించారు. నాటి నుంచి నేటి వరకు పేరుకుపోయి ఉన్న చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది.



ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి (ఫైల్)

47 ఎకరాల విస్తీర్ణంలో..

నాడు వైఎస్సార్ చేపట్టిన స్ఫూర్తితో నేడు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు గత కొంత కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో సుందరమైన ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్ సుమారు 47 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. సువిశాల స్థలంలో అంతర్జాతీయ స్థాయి ఫ్లవర్‌పార్కు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

అత్యుత్తమ ఫ్లవర్‌పార్కుగా నిర్మిస్తాం..



ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. కొన్ని కోర్టు కేసులతో జాప్యం ఏర్పడుతుంది. సుమారు 47 ఎకరాల విస్తీర్ణంలో పార్కు నిర్మాణానికి గత ప్రభుత్వం సుముఖత చూపడంతో ప్రహరీ నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. నాడు చెత్త డంపింగ్‌యార్డ్‌తో తీవ్ర దుర్వాసనతో ఉన్న ప్రాంతాన్ని నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరలించేలా చొరవ తీసుకున్నారు. నాటి చెత్త ప్రాంతం నేడు అద్భుతమైన ఫ్లవర్‌పార్కుగా రూపుదిద్దుకోనుంది.

– సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుజాతానాయక్



ఉత్సవాల్లో పాల్గొన్న జిట్టా రాజశేఖర్‌రెడ్డి

హస్తినాపురం: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతనాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శివనాయక్, సచిన్‌నాయక్, రవినాయక్, వెంకటేష్, శివనాయక్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో

మన్సూరాబాద్: బంజారా ఆరాధ్యదైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోగ్ ఉత్సవాలను నిర్వహించి సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిడి రాంచందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రమావత్ రవి నాయక్, శ్రీధర్‌నాయక్, రాములునాయక్, గోపీనాయక్, శోభమ్మ, రెడ్యానాయక్, దేవానాయక్, పాండు నాయక్ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ..

జీ హైస్కూల్ వద్ద ఆందోళన



పాఠశాలలో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

హయత్‌నగర్: ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భారీగా ఫీజులు పెంచారని శనివారం హయత్‌నగర్‌లోని జీ హైస్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఎన్నడు లేని విధంగా ఒకేసారి 30–50 శాతం పెంచారని ఈ విషయమై పలుమార్లు ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తానని ఇంత వరకు చేయలేదన్నారు. ఫీజులు భారంగా మారడంతో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న జీ హైస్కూల్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అవయవదానం



కిషోర్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. భద్రాచలం కొత్తగూడెం జిల్లా చెంచుపల్లి మండలం రుద్రామ్‌పూర్ గ్రామానికి చెందిన కిషోర్ (56) సింగరేణి కాలరీస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న ఆకస్మాతుగా కాళ్లు పడిపోయి మాటరాకుండా ఇంట్లో కుప్పకూలి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్యానికి కామినేని హాస్పిటల్‌కు తరలించారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందించగా స్పందన లేకపోవడంతో ఈ నెల 14న బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. జీవన్‌ధాన్ ప్రతినిధులు అవయవదానంపై కిషోర్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి వారి అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీనవ్‌ధాన్‌ను దానం చేశారు.

పరారీలో ఉన్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్



హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్



ఆనంద్ అగర్వాల్

మలక్‌పేట: పరారీలో ఉన్న ఇద్దరు రౌడీ షీటర్లను సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు వివరాల ప్రకారం.. బార్కాస్‌కు చెందిన హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్ ఆల్ ఇంద్రూస్(27), (చాంద్రయణగుట్ట పీఎస్‌లో రౌడీషీటర్) వృత్తి రీత్యా హార్స్ బిజినెస్, హార్స్‌రైడర్స్ కాగా 18 ఆస్తి నేరాలకు పాల్పడ్డాడు. 7 ఎన్‌బీడబ్ల్యూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు విచారణకు దూరంగా ఉండి చాలా కాలంగా పరారీలో ఉన్నాడు. మాదన్నపేటకు చెందిన రౌడీషీటర్ ఆనంద్ అగర్వాల్ అలియాస్ మహ్మద్ జోయబ్ అలియాస్ ఎలుక అలియాస్ అన్నూ (మాదన్నపేట పీఎస్‌లో రౌడీషీటర్) గతంలో రౌడీ షీటర్ భక్తియార్ ఆఘా ఖురేషి హత్యతో 11 కేసుల్లో ప్రమేయం ఉంది. ఆగస్టు–2024 మాదన్నపేట పీఎస్ ఎన్‌బీపీఎస్ కేసులో చిక్కుకున్నాడు. నేరాలు చేసినప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. పక్కా సమాచారంతో కమిషనర్ టాస్క్‌ఫోర్స్, సౌత్ ఈస్ట్ జోన్ బృందం శనివారం ఇరువురిని అదుపులోకి తీసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు.

నేడు రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

హయత్‌నగర్: హయత్‌నగర్ బ్లాక్ ఆఫీస్ ఆవరణలో పునర్నిర్మాణం చేసిన శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం జరుగుతుందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం నుంచి శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలు ఆదివారం జరిగే యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనతో ముగుస్తాయని పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం

లింగోజిగూడ: కొత్తపేట బచ్‌పన్ అకాడమీ హైట్స్ పాఠశాలలో శనివారం లాయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు.అనంతరం వైద్యుడు కుంభం నరేష్ విద్యార్థులు దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి ఆదేశించారు. డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. డివిజన్‌లో అన్ని సౌకర్యాలతో కూడిన కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని వేసవిలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్య రాకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

ఆస్తిపన్ను వసూలుపై స్పెషల్‌డ్రైవ్



డీసీ జయంత్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్ పరిధిలో నేటి నుంచి వారం రోజులపాటు ఆస్తిపన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు రూ.144 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో డివిజన్‌కు ఇద్దరు చొప్పున అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడంచారు. మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

నేటి నుంచి కులగణన రీసర్వే

చాదర్‌ఘాట్: నేటి నుంచి కులగణన రీసర్వే ప్రారంభిస్తున్నట్లు మలక్‌పేట్ డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సర్వేలో వివరాల నమోదు చేసుకోని వారు ఇప్పుడు ఇవ్వాలన్నారు. అధికారి ఇంటికి రాకపోతే డీసీ కార్యాలయంలోనూ తమ తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మలక్‌పేటలో ఐదు శాతం మంది మాత్రమే వివరాలు ఇవ్వలేదని ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని, సర్వేను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కమలానగర్ కాలనీ అభివృద్ధికి చర్యలు



కమలానగర్ కాలనీలో పర్యటిస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. శనివారం కమలానగర్ కాలనీలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. కాలనీలో బీటీ రోడ్లు ధ్వంసమయ్యాయని ఈ సందర్భంగా కార్పొరేటర్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిప్యూటీ మేయర్ దృష్టికి తెచ్చారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్ కోసం భవనాలు నిర్మించాలని కోరారు. మాచవరం వెంకటేశ్వర్లు ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందజేసిన కుట్టు మిషన్లను మహిళలకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ యాదయ్య, శానిటేషన్ డీఈ నీలిమ, ఏఈ హేము నాయక్, కాలనీ నాయకులు సుబ్బారావు, ఉపేందర్‌రెడ్డి, పూలమ్మ, బండారి భాస్కర్, గంగాని శ్రీను పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మన్సూరాబాద్: నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 23న నిర్వహిస్తున్న తెలంగాణ కుకింగ్ గ్యాస్ వర్కర్స్ యూనియన్ 5వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆయన సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్యాస్ డెలివరీ వర్కర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, బీమా లాంటి సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆటోరిక్షాలను ఏజెన్సీలే ఇప్పించడంతో పాటు నిర్వహణ భారాన్ని వారే తీసుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల ఆరోగ్య, రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీగౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, విశ్వనాథుల పుష్పగిరి, మారోజు రామన్న, బుర్ర చంద్రయ్య, ఎండీ యూనుస్, నర్సింగ్‌రావు, అజయ్‌రెడ్డి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జీఎం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

లింగోజిగూడ: నాగోలు డివిజన్ పరిధిలోని సహభవన టౌన్ షిప్‌లో సమస్యలు పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ రాజీవ్ స్వగృహ జీఎం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. టౌన్‌షిప్ ప్రహరీ సరిగ్గా లేకపోవడంతో జంతువులు టౌన్‌షిప్‌లోకి వస్తున్నాయన్నారు. టౌన్ షిప్‌లో ఫ్లాట్లు కొని రెండేళ్లు అవుతున్నా సెల్లర్‌ను యజమానులకు అప్పగించకపోవడంతో పార్కింగ్ లేక రోడ్లపైనే వాహనాలను ఆపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పలు చోట్ల లీకేజీలతో గోడలు దెబ్బతిన్నాయని, వర్షపు నీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రవిందర్‌రెడ్డి, ఏజీఎం అనిల్‌రెడ్డి, సభ్యులు నల్లమునీందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాకేష్, చంద్రశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలి



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనస్థలిపురం: సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. వనస్థలిపురం చింతలకుంటలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బొమ్మగాని ధర్మభిక్షం జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ కన్వర్టెడ్ బీసీ అని కాంగ్రెస్.. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీది ఏ కులమో చెప్పాలని బీజేపీ నాయకులు అంటున్నారని, ఇరువురి కులమేంటో దేశ ప్రజలకు తెలియాలంటే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప యోధుడు ధర్మభిక్షం అన్నారు. బీసీలను రాజకీయంగా వాడుకోవాలని ఏ పార్టీ చూసినా సహించేది లేదని, బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచే వరకు ఎవరినీ వదలబోమన్నారు.ఈ కార్యక్రమంలో బాలరాజుగౌడ్, దుర్గయ్య, కనకాల రామ్ కురుమ, రఘురాం నేత, రాజు, వెంకన్న, లింగస్వామి గౌడ్, రావులకోల్ నరేష్, ప్రజాపతి, జాజుల లింగం, శ్రీనివాస్, పానుగంటి విజయ్ పాల్గొన్నారు.

ధర్మభిక్షంకు నివాళి

మన్సూరాబాద్: సీపీఐ హయత్‌నగర్ మండల సమితి కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన జీవితమంతా పేద ప్రజలకే అంకితం చేసిన మహామనిషి ధర్మభిక్షం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌గౌడ్, రమావత్ సక్రునాయక్, గొల్కొండ నాగరాజు, కృష్ణ, సౌజన్య, రాధ, సుశీల, ఆదిలక్ష్మి, కవిత, మమత, శ్రీను పాల్గొన్నారు.

న్యూ నాగోలులో..

లింగోజిగూడ: న్యూ నాగోలులోని ఎస్‌ఏ డంగే భవన్‌లో సీపీఐ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బొడ్డుపల్లి కృష్ణ, సుధాకర్, శ్రీదేవి, మమత, సుశీల, సౌజన్య, మల్లేష్, శివ, బిక్షనాయక్, లొకియా, జైపాల్, శంకర్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు నివాళి



శ్రీకాంత్‌చారి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ కవిత

మన్సూరాబాద్: ఖమ్మంలో నిర్వహిస్తున్న బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్తున్న ఎమ్మెల్సీ కవిత శనివారం ఉదయం ఎల్‌బీనగర్‌లో ఆగి మహాత్మాజ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంత్‌చారి విగ్రహాలకు పూలమాల వేసి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బొల్ల శివశంకర్, దూగుంట్ల నరేష్, ఆలకుంట హరి, పోచబోయిన జగదీష్‌యాదవ్, ఎలుకొండ రాంకోటి, యాదగిరి, గాలయ్య, సత్యంచారి పాల్గొన్నారు.

పాలకవర్గం.. సమస్యల పరిష్కారంలో విఫలం



వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

చాదర్‌ఘాట్: ఓ వైపు సరైన ధరలు లేక మిర్చి రైతులు ఇబ్బందులు పడుతుండగా మలక్‌పేట మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు నిర్ణయించిన ధరలకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి మార్కెట్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ధరల వివరాలు.. ఏ సమయంలో మిర్చిని మార్కెట్‌కు తీసుకొస్తే ధరలు అనుకూలంగా ఉంటాయో అనే వాటిని దృష్టిలో పెట్టుకొని రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా అసలు మార్కెట్ పాలకవర్గం రైతుల సంక్షేమం, వారికి అందుబాటులో ఉండాల్సిన పాలకవర్గం మిర్చి యార్డును ఒక్కసారి కూడా సందర్శించిన దాఖలాలు లేవని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు వచ్చి మిర్చి రైతులతో ధరల విషయంలో మాట్లాడి అవగాహన కల్పిస్తున్నా పాలకవర్గం ఎక్కడా అని పలువురు రైతులు అడుగుతున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం స్పందించి రైతులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.